క్లుప్తంగా

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడిగా మధు



మహబూబాబాద్ అర్బన్: సంగారెడ్డి జిల్లాలో పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సెలింగ్‌లో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా మనుకోటకు చెందిన బోనగిరి మధును, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాగరాజులను ఎన్నుకున్నట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పరుశరాం ఆదివారం తెలిపారు.

సీఏ పట్టా పొందిన గిరిజన విద్యార్థి



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని భవాని నగర్ తండాకు చెందిన భారత రైల్వే ఉద్యోగి భట్టు పాండునాయక్, మంగళ దంపతుల కుమారుడు భట్టు రాహుల్ చార్టెడ్ అకౌంటెంట్ విద్య పూర్తి చేసి పట్టా పొందాడు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని స్టేడియంలో ఆదివారం నిర్వహించిన సీఏ పట్టాల ప్రధానోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి చంద్రశేఖర్ చేతుల మీదుగా రాహుల్ సీఏ పట్టా అందుకున్నాడు. ఈసందర్భంగా తల్లిదండ్రుల అభినందించారు. ఐఏఎస్ సాధించడమే లక్ష్యమని భట్టు రాహుల్ పేర్కొన్నాడు.

నేడు అప్రెంటిస్ మేళా

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని నేడు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఉదయం 10:30 గంటలకు అన్ని గ్రేడుల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వి.రాధాకృష్ణ ఆదివారం తెలిపారు. వివిధ కంపెనీల ఆధ్వర్యంలో నిర్వహించే ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు సంబంధిత కోర్సుల సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఆధార్‌కార్డు, పాన్ కార్డు, ఫొటోలు, అకౌంట్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను తీసుకొని మానుకోట జిల్లా కేంద్రంలోని ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు హాజరుకావాలన్నారు.

వ్యవసాయ విద్యుత్ మోటార్ల చోరీ

చిన్నగూడూరు: వరిపొలాల సాగుకు పలువురు రైతులు ఆకేరు వాగులో ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ విద్యుత్ మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. వ్యవసాయ మోటార్ల చోరీపై బాధిత రైతులు పసునాది రజిత, కోల సతీష్, భర్తాపురం వెంకటేశ్వర్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. బాధిత రైతులు ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆకేరు వాగుపై వరిసాగు కోసం ఏర్పాటు చేసుకున్న మూడు వ్యవసాయ విద్యుత్ మోటార్లను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసి విద్యుత్ తీగలను చిందరవందరగా పడేసినట్లు బాధిత రైతులు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.90వేలు ఉంటాయని తెలిపారు. పోలీస్ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, చోరీపై విచారణ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

లారీలనుంచి డీజిల్ అపహరణ

మహబూబాబాద్ రూరల్: నిలిపి ఉంచిన లారీల నుంచి 500 లీటర్ల డీజిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన సంఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. లారీ అసోసియేషన్ సభ్యులు నాగరాజు, దశరథ్, యాకయ్య, బంగారి, సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్‌లోని బయ్యారం రోడ్డులో పాత ఆర్టీఓ ఆఫీస్ సమీపంలో తమ ఐదు లారీలను శనివారం అర్ధరాత్రి నిలిపి ఉంచారు. ఆదివారం ఉదయం లారీల వద్దకు వచ్చి చూసే సరికి డీజిల్ ట్యాంక్‌లకు ఉన్న పైపులు కట్ చేసి 500 లీటర్ల డీజిల్ దొంగిలించారు. డీజిల్ చోరీ ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని అసోసియేషన్ సభ్యులు మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బీఆర్‌ఎస్ పాలనలోనే అన్యాయం

మహబూబాబాద్: నిరుద్యోగులకు మాజీ సీఎం కేసీఆర్ పాలనలోనే తీరని అన్యాయం జరిగిందని నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక అమరవీరుల స్థూపం వద్ద ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా వ్యవస్థలో పెను మార్పులు తీసుకొస్తూ పదోన్నతులు, బదిలీలు సక్రమంగా జరగడాన్ని వారు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక ఉద్యోగం గాని, రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. ఈ సమావేశంలో రామరాజు, బాలరాజు, రాజశేఖర్, రాజు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం..

- జ్వరాలు రాకుండా జాగ్రత్తలు అవసరం
- పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి
- కాచి చల్లార్చిన నీటిని తాగాలి



పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెద్దవంగర: వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటుంది. దీంతో దోమలు వృద్ధి చెందుతాయి. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వ్యాధులకు కారణమవుతాయి. దోమకాటుకు గురి కాకుండా జ్వరాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు పేర్కొంటున్నారు. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. గాలి, నీరు ద్వారా సూక్ష్మక్రిములు శరీరంలోకి ప్రవేశించి జ్వరం వచ్చే అవకాశాలు ఉన్నాయి. సోకుతుంది. కొందరికి జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు ఉంటాయి. వైరల్ జ్వరం మూడు నుంచి ఏడు రోజులుపాటు ఉంటుంది.

చేతులు శుభ్రం చేసుకోవాలి

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. భోజనం చేసే ముందు తప్పని సరిగా చేతులుశుభ్రంగా కడుక్కోవాలి. తాజా, వేడి ఆహారం తీసుకోవాలి. దోమలు కుట్టకుండా దోమ తెరలు వినియోగించాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. ఇటీవల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని జీపీ సిబ్బంది, వైద్య సిబ్బందితో కలిసి సీజనల్ వ్యాధులపై ఎంపీడీఓ వేణుమాధవ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి



ప్రస్తుతం సీజనల్ వ్యాధులు సోకే సమయం కావడంతో జ్వరాలు వచ్చే అవకాశం ఉంది. జ్వరం వస్తే వెంటనే పల్లె దవాఖానాలో చికిత్స చేయించుకోవాలి. ఉచితంగా పరీక్షలు నిర్వహించి సకాలం వైద్యం అందజేస్తాం. ప్రజలు శుభ్రమైన నీరు, ఆహారం తీసుకోవాలి. వ్యక్తిగత శుభ్రత పాటిస్తే రోగాలు దగ్గరికి రావు.

- కోట మహేష్, పల్లె దవాఖానా వైద్యుడు, పోచంపల్లి

డీఈఓను సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న సామ మల్లారెడ్డి

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తున్న డీఈఓను సస్పెండ్ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఇటీవల నిర్వహించిన పదోన్నతుల, బదిలీల్లో ఎస్సీ మహిళలకు రావాల్సి పదోన్నతులు రోస్టర్ పాటించనందున ఎస్సీ పురుషులకి కేటాయించారన్నారు. ఉపాధ్యాయుల సంఘం చొరవతో తిరిగి మహిళలకు పదోన్నతులు కల్పించారన్నారు. వారి స్థానంలో పదోన్నతులు పొందిన పురుషులకు రీవర్షన్ ఇవ్వడంతో వారు మానసికంగా కుంగిపోయారన్నారు. అనేక పొరపాట్లు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న డీఈఓను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యాదర్శులు మురళీకృష్ణ, యాకూబ్, జిల్లా కార్యదర్శులు వెంకటేశ్వర్లు, భిక్షపతి, మంజుల, ఆడిట్ కమిటీ కన్వీనర్ వివేక్, హరినాయక్, సంజీవ, శ్రీనివాస్, ప్రవీణ్, రాజశేఖర్, సుందర్ కుమార్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

కేసముద్రం: హనుమకొండలో ఈనెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జరిగే కేవీపీఎస్ రాష్ట్రస్థాయి సామాజిక చైతన్య శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జిన్నా లచ్చయ్య, చింత ఎల్లయ్య, యాకయ్య, మచ్చ వెంకన్న పాల్గొన్నారు.

ఎస్సై మృతిపై విచారణ జరపాలి

కేసముద్రం: అశ్వరావుపేట ఎస్సై శ్రీనివాస్ మృతిపై విచారణ జరపాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి విష్ణువర్ధన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సంఘం ఆధ్వర్యంలో శాంతియుత నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తూ, సామాన్య ప్రజలకు రక్షణ కల్పించే ఎస్సై శ్రీనివాస్ ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరమన్నారు. కార్యక్రమంలో కొనకటి మహేందర్, రవీందర్, నరేష్, వేణు, చంటి, హరీశ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

భీమునిపాద జలపాతం వద్ద సందడి..



జలపాతం వద్ద పర్యాటకులు

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానాగారం శివారు భూములవంచ సమీప దట్టమైన అడవిలో భీమునిపాద జలపాతం జాలువారుతోంది. ఆదివారం సెలవు దినం కావడంతో మండల కేంద్రంతో పాటు కేసముద్రం, నెక్కొండ, నర్సంపేట, తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు భీమునిపాదం చేరుకుని జలపాతం వద్ద సందడి చేశాడు. జలపాతం వీక్షిస్తూ ఆనందంగా గడిపారు. కాగా, ఇప్పుడిప్పుడే ఫారెస్టు అధికారులు జలపాతం వద్ద వసతులు కలిస్తున్నారు. కొమ్ములవంచ నుంచి జలపాతం వరకు బీటీ రోడ్డు సౌకర్యం, మహిళలకు స్నానాలు చేసి దుస్తులు మార్చుకునేందుకు గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

'విభజన రాజకీయాలు చేస్తున్న బీజేపీ'



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

కురవి: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విభజన రాజకీయాలు చేస్తుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ సమావేశం తురక రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా బీజేపీ మతతత్వ విధానాలతో, విద్వేషపూరితంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఈనెల 18వ తేదీన కురవిలో పార్టీ నిర్మాణ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కరణం రాజన్న, నాయకులు సమ్మయ్య, కన్నె వెంకన్న, బుడమ వెంకన్న, సారయ్య, రవి, ఉప్పలయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1989–90 ఎస్సెస్సీ బ్యాచ్‌కి చెందిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఒకే చోట కలుసుకున్నారు. ఈమేరకు పూర్వ విద్యార్థులంతా కలిసి పాఠశాలలో రూ.లక్షతో ఏర్పాటు చేసిన నీటి శుద్ధీకరణ యంత్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో చిన్న వెంకన్న, చంద్రయ్య, రవిబాబు, మధుబాబు, బైరు శ్రీనివాస్, గుర్రం శ్రీను పాల్గొన్నారు.

తైక్వాండోలో మానసకు గోల్డ్‌మెడల్



మానసను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

మహబూబాబాద్ అర్బన్: ఇటీవల గోవాలో జరిగిన అండర్–12 తైక్వాండో పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన మానసను, ఆమె తండ్రి మధును జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో కాళోజీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వాకర్స్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ డోలి సత్యనారాయణ మాట్లాడుతూ.. మానుకోట క్రీడలకు పుట్టినిల్లులాంటిందన్నారు. భవిష్యత్‌లో మానస కూడా అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, బాధ్యులు లక్ష్మయ్య, విష్ణువర్ధన్, సుధాకర్, నాగేశ్వర్‌రావు, వీరన్న పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి



మాట్లాడుతున్న తిరుపతక్క

కురవి: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు పగిడిపాల తిరుపతక్క డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కొత్తూరు(జీ) శివారు బంచరాయి తండాలో పీఓడబ్ల్యూ కురవి సబ్ డివిజన్ మహాసభ జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్త్రీ, పురుష సమానత్వం కోసం పోరాడాలన్నారు. మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని తెలిపారు. ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. బీజేపీ మనువాద వ్యవస్థకు మళ్లీ ఆజ్యం పోస్తు పురుషాధిక్య సమాజాన్ని ప్రభావితం చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఎస్‌కె బాబన్న, పీఓడబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె యాకూబీ, నాయకులు సామ రజిత, సామ పాపయ్య, ఎండి కవిత పాల్గొన్నారు. కాగా మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా భూక్య కేస్లీ, ఉపాధ్యక్షురాలిగా గుగులోత్ కమిలి, కార్యదర్శిగా బండ్ల అఖిల, సహాయ కార్యదర్శిగా దేవి, కోశాధికారిగా బానోత్ సునీత, కార్యవర్గసభ్యులుగా సక్కి, శారద, కనకమ్మలను ఎన్నుకున్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



నెహ్రూసెంటర్: సంఘం జెండా ఆవిష్కరిస్తున్న పీరయ్య



మహబూబాబాద్ రూరల్: అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కత్తుల రేణుక

నెహ్రూసెంటర్: ఎస్సీ వర్గీకరణ సాధనలో మంద కృష్ణమాదిగతో కలిసి పోరాటంలో దళితులు భాగస్వాములు కావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి గుగ్గిళ్ల పీరయ్య మాదిగ పిలుపునిచ్చారు. పార్టీ 30వ ఆవిర్భావ వేడుకలను జిల్లా కేంద్రంలోని మంద కొమురమ్మనగర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా మహిళ అధ్యక్షురాలు ఎండి. రజియా, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీను, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బూరి వినోద్‌రెడ్డి, కందిపాటి భిక్షపతి, చలగొల్ల వెంకన్న పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి గ్రామంలో మాదిగ మహిళా జిల్లా అధ్యక్షురాలు కత్తుల రేణుక ఆదివారం ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేశారు. అనంతరం బీఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గార్ల: గార్లలోని నెహ్రూసెంటర్‌లో ఎమ్మార్పీఎస్ జెండాను సంఘం జిల్లా సీనియర్ నాయకుడు గిన్నారపు మురళి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కొత్తపల్లి వెంకన్న, నాయకులు నారాయణ, రాములు, సత్తి పాల్గొన్నారు.

మరిపెడ/మరిపెడ రూరల్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల కేంద్రంలో ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్ ఎదుట ఆదివారం సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జినక స్వామిమాదిగ సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగు రవీందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గూడూరు: మండల కేంద్రంలో జెండా ఎగురవేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ హెచ్ శివ, శ్రీనివాస్, మందుల ప్రవీణ్, వెంకన్న, సాంబయ్య పాల్గొన్నారు.

తొర్రూరు: ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా పోరాటాలు చేస్తామని ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకుడు సోమారపు ఐలయ్య, జిల్లా కోఆర్డినేటర్ వెంకన్న తెలిపారు. ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని డివిజన్ కేంద్రంలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు వీరన్న, బుచ్చయ్య, రామచంద్రయ్య, సైదులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

తొర్రూరు ఏజీపీగా వెంకన్న



తొర్రూరు: తొర్రూరు జూనియర్ సివిల్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన బండపల్లి వెంకన్న నియమితులయ్యారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

గార్ల: రాష్ట్రంలో నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం గౌరవ అధ్యక్షుడు జంపాల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం ఆయన నాయీ బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫ్యాక్స్ ద్వారా వినతిపత్రం పంపినట్లు తెలిపారు.

సన్మానం

కురవి: సీరోలు మండలం తాళ్లసంకీస గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది మూడ్ బాలుచౌహాన్‌ను కాకతీయ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈమేరకు ఆయనను బీఆర్‌ఎస్ రాష్ట్ర యూత్ నాయకుడు గుగులోత్ రవినాయక్, నాయకులు గంగాధర్‌రెడ్డి, రాజునాయక్, ఆదివారం సన్మానించారు.

నూతన చట్టాలను రద్దు చేయాలి

గూడూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన కార్మిక చట్టాలను వెంటనే రద్దు చేయాలని ఎంసీపీఐయూ జిల్లా ఇన్‌చార్జ్ కేంద్ర కమిటీ సభ్యుడు గోనే కుమారస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, వీరస్వామి, సలీం, నరసింహారెడ్డి, రామయ్య పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



మహబూబాబాద్ రూరల్: వీఎస్.లక్ష్మీపురం, సింగారం ఉమ్మడి గ్రామాల ఎంపీటీసీ తోట యాకాంబ్రం తన పరిధిలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేశారని వీఎస్.లక్ష్మీపురం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మీసాల వెంకన్న అన్నారు. మండలంలోని వీఎస్.లక్ష్మీపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎంపీటీసీ యాకాంబ్రంను ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకన్న, నర్సయ్య, సోమిరెడ్డి, పాపయ్య, లింగన్న పాల్గొన్నారు.

కుక్కల దాడిలో మేక పిల్లల మృతి



కేసముద్రం: కుక్కల దాడిలో ఐదు మేకపిల్లలు మృతి చెందిన సంఘటన ఇనుగుర్తి మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన చిన్నాల ఐలయ్య అనే వ్యక్తి ఇంట్లో ఉన్న దొడ్డిలో మేక పిల్లలను ఉంచి, పొలం పనులకు వెళ్లారు. ఈ క్రమంలో దొడ్డిలో ఉన్న ఐదు మేకపిల్లలపై కుక్కలు దాడి చేయడంతో మృతి చెందాయి. తీరా ఇంటికి వచ్చి చూసే సరికి మేక పిల్లలు చనిపోయినట్లు గుర్తించారు. రూ.25వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

అమరవీరులకు నివాళి

మహబూబాబాద్ రూరల్: భారతదేశ విముక్తి కోసం జరిగిన పోరాటంలో అసువులు బాసిన అమరవీరులకు ఆదివారం ఘన నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయ ఆవరణంలోని జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి స్వాతంత్ర్య సమర యోధులు నూకల లింగారెడ్డి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సింగు రమేష్, రవీంద్రగుప్త పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేయాలి

గార్ల: ఖరీఫ్ ప్రారంభమైనందున రైతులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని ముల్కనూరు ఎంపీటీసీ మాలోత్ వెంకట్‌లాల్ విద్యుత్ అధికారులను కోరారు. గార్లలో ఆయన మాట్లాడారు. ముల్కనూరు పంచాయతీకి బయ్యారం మండలం కొత్తపేట సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అయ్యే విద్యుత్‌లో రోజుకు 10సార్లు ట్రిప్ అవుతుండటంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

జయప్రదం చేయాలి

కేసముద్రం: దేశవ్యాప్తంగా జూలై 10న జరగనున్న కార్మికుల డిమాండ్స్ డేను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన ఆసంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, కందునూరి శ్రీనివాస్, రాజమౌళి, వీరన్న, మౌనిక, జల్లె జయరాజ్ పాల్గొన్నారు.

పోలీస్ కళాజాతా

కేసముద్రం: మండలంలోని కోరుకొండపల్లి గ్రామంలో కేసముద్రం పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి పోలీసులు కళాజాతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై వంశీధర్ మాట్లాడుతూ.. యువత గంజాయి, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

నెల్లికుదురు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఇస్సపల్లి సైదులు డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 10న జరిగే స్కీం వర్కర్ల ధర్నాను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పుల్లయ్య, వెంకన్న, నర్సయ్య, ఐలయ్య, శ్రీనివాస్, మురళి, యాకన్న పాల్గొన్నారు.

బ్యాగు అప్పగింత

నెల్లికుదురు: ప్రయాణికులు ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన లగేజీ బ్యాగును ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ తిరిగి ప్రయాణికులకు అప్పగించిన సంఘటన ఆదివారం మండల కేంద్రంలో జరిగింది. మండలంలోని రత్తిరాం తండాకు చెందిన గుగులోతు గోపి బంధువులు లగేజీతో ఆర్టీసీలో వస్తున్నారు. లగేజీ బస్సులోనే మరిచిపోయారు. గుర్తించిన డ్రైవర్ చీకటి వెంకటయ్య, కండక్టర్ మధార్ నెల్లికుదురు బస్టాండ్‌లో గోపి బంధువులకు బ్యాగును అప్పగించారు.

న్యాయవాద సేవా కేంద్రం ప్రారంభం



గార్ల: గార్లలో న్యాయవాద సేవా కేంద్రాన్ని లాయర్ జంపాల విశ్వ ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోర్టు కేసులు ఉన్నవారు సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, నాయకులు శ్రీనివాసరావు, వెంకట్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత

బయ్యారం: తమతో చదువుకొని అర్థాంతరంగా మృతి చెందిన మిత్రుడి కుటుంబానికి అతని బాల్యమిత్రులు చేయూతగా నిలిచి ఆర్థికసాయం చేసిన సంఘటన ఆదివారం మండలంలోని కొత్తగూడెంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కేదాస్ ప్రసాద్ అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి బాల్యమిత్రులు రూ.30వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో మిత్రులు సుధాకర్, వీరన్న, సతీష్, సురేందర్ పాల్గొన్నారు.

ప్రతిభా అవార్డులు అందజేస్తాం..

దంతాలపల్లి: మండలంలోని పెద్దముప్పారం గ్రామ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, 2024–25 విద్యా సంవత్సరం నుంచి ప్రతిభ అవార్డులు ఇవ్వనున్నట్లు పూర్వ విద్యార్థులు ఎన్‌ఆర్ఐలు ప్రదీప్, ప్రమోద్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన మా తండ్రి చెరుకు సుధాకర్‌రావు జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రథమ బహుమతి రూ.18వేలు, ద్వితీయ రూ.12వేలు, ప్రత్యేక బహుమతి రూ.10వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శంకరయ్య, పూర్వ విద్యార్థులు, నాగమల్లయ్య, సాహెబ్ అలీ, ప్రసాద్, సోమన్న, శిరీష్, శ్రీరాములు పాల్గొన్నారు.

కాంబోడియా నుంచి స్వదేశానికి..



బయ్యారం: మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గంధంపల్లికి చెందిన మున్సిఫ్ ప్రకాశ్ బతుకుదెరువు కోసం కాంబోడియా దేశానికి వెళ్లాడు. అక్కడ ఎదుర్కొంటున్న కష్టాలను ప్రకాశ్ సోషల్ మీడియా ద్వారా తెలియజేయడంతో పలువురు ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు స్పందించారు. ఈ క్రమంలో మాజీ ఎంపీ మాలోత్ కవిత కాంబోడియా దేశంలో ఉన్న తన మిత్రుడి ద్వారా ప్రకాష్‌ను స్వదేశానికి తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఢిల్లీకి చేరుకున్న ప్రకాశ్ సోషల్ మీడియా ద్వారా మాజీ ఎంపీ కవిత తనతో పాటు తన మిత్రులు చేసిన సహాయాన్ని కొనియాడి కృతజ్ఞతలు తెలిపారు. ఎట్టకేలకు ప్రకాశ్ స్వదేశానికి రావడంతో అతడి కుటుంబసభ్యులతో పాటు స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.